# 3

# “నీవు పరిశుద్ధపరచబడ్డావు!”

క్రైస్తవుడు అవటంఅంటే, లోకాన్ని విడిచి దేవుని బిడ్డగా గుర్తించబడటం. క్రైస్తవ్యం అంటే, “వెలుగులో నడవడం” (1 యోహాను 1:6-9) మరియు “దేవుని పోలియుండడం” (ఎఫెసీయులకు 5:1). దేవుని పోలియుండుటకు ఎంతో సమర్పణ అవసరం. ఒక శిశువు ఎదిగి పెద్దవాడుగా తయారయినట్లే, ఈ ఎదగటం (ఎఫెసీయులకు 4:15; 2 పేతురు 3:18). ఒక నూతన క్రైస్తవుడు ఎదుగుతున్నప్పుడు అతని ఆలోచనలు, తీర్మానాలు, క్రియలు దేవుడు ఏం కోరుకుంటాడో ఆ ప్రకారం ఉంటాయి (చూడండి రోమీయులకు 12:1, 2). అతడు వెనువెంటనే పరిణితి చెందక పోయినా, అతడు ఎదిగిన దేవుని అనుచరునిగా ఆలోచించుటకు, జీవించుటకు ప్రయత్నిస్తాడు (1 కొరింథీయులకు 14:20). ఈ మార్పు వెంటనే ఎలా వస్తుంది? నూతన క్రైస్తవుడు తన పాత అలవాట్లను మానివేసి దేవుని చిత్తానికి అనుకూలమైన ఆలోచనలకు ఎందుకు కలిగియుండాలి? దీనికి కారణం. సర్వసాధారణమైనది: అతడు “పరిశుద్ధపరచబడ్డాడు.”

“పరిశుద్ధ పరచబడడం” అనేది ఒక ముఖ్యమైన బైబిలు అంశం. ఇది సర్వశక్తుని చేత వాడబడేందుకువేరుగా ఉంచబడిన ఒక వస్తువు, స్థలం లేదా వ్యక్తి గురించి చెప్తుంది. మోషే ధర్మశాస్త్ర కాలంలో ఒక వస్తువు పరిశుద్ధమైన తరువాత దాన్ని సాధారణ వినియోగానికి వాడరు. లేవియకాండం 10:1-3లోని ఇద్దరు యాజకులు “ఈ ప్రత్యేకంగా” ఉంచడాన్ని గౌరవించక నశించిపోయారు. తన ప్రజలు ఈ పరిశుద్ధ నూతన జీవితమును అనుసరించాలని దేవుడు స్పష్టంగా చెప్పాడు.

క్రైస్తవులైన మీరిప్పుడు పరిశుద్ధపరచబడ్డారు. ఈ మాట భయమేస్తుందా? ఇశ్రాయేలులోని ఒక ఆచారం పరిశుద్ధపరచడాన్ని వివరిస్తుంది. యూదులు తమకు కలిగిన వాటన్నిటిలోనుండి దేవునికి పదియవ వంతు ఇవ్వాలి. తమ గొఱ్ఱెలలో నుండి దేవునికి పదియవ వంతుని అర్పణగా ఇయ్యడం ఒక నియమం. దీనిని చేసే విధానం ఆసక్తికరంగా ఉంటుంది. గొఱ్ఱె పిల్లలను తల్లి గొఱ్ఱె నుండి వేరు చేసి సన్నని ద్వారం ఉన్న గొఱ్ఱెలదొడ్డిలో ఉంచుతారు. ద్వారం బయట తల్లి గొఱ్ఱెలు ఉంచబడతాయి. సైగ చేసినప్పుడు, ద్వారం తెరువబడుతుంది, అప్పుడు గొఱ్ఱె పిల్లలు తల్లి గొఱ్ఱెను చేరుటకు పరిగెడుతాయి. ఒక వ్యక్తి ద్వారం దగ్గర నిలువబడి ఇనుము కలిసిన “రంగు మన్నులో” ముంచిన కడ్డీని ఉంచాడు. ప్రతి పదవ గొఱ్ఱె పిల్ల వెళ్ళగానే అతడు కడ్డీని రంగులో ముంచి దాన్ని ముడతాడు. ప్రతి పదియవ గొఱ్ఱెపిల్ల కఱ్ఱ క్రింద నడుచునట్లు చూస్తాడు (చూడండి లేవీయకాండం 27:32). అలా ప్రతిదాన్ని ముట్టిన తరువాత “ఇది పరిశుద్ధమవును గాక” అని అంటాడు. ప్రవక్త యెహెజ్కేలు ఈ ప్రాచీన ఆచారాన్ని ఉపయోగించి పరిశుద్ధపరచడాన్ని గురించి చెప్తున్నాయి – “చేతికఱ్ఱ క్రింద మిమ్మును దాటించి నిబంధనకు లోపరచెదను” (యెహెజ్కేలు 20:37). ప్రవక్త మాటలు స్పష్టంగా ఉన్నాయి. పరిశుద్ధపరచబడిన వారందరూ దేవుని నిబంధన క్రిందయున్నారు! (చూడండి యిర్మీయా 33:13.)

పరిశుద్ధపర్చబడడం అనేది ఒక అవకాశం కాదు. క్రైస్తవునిగా, మీరు దేవుని సొత్తుగా గుర్తించబడ్డారు. క్రీస్తు రక్తం చేత విమోచింపబడి మీరు దేవుని సంబంధికులయ్యారు (తీతు 2:14). కాబట్టి మీరు పరిశుద్ధంగా జీవించాలి. ఎఫెసీయులకు పత్రిక రెండో భాగంలో పౌలు పరిశుద్ధ పరచబడిన జీవితం గురించి చెప్తున్నాడు. క్రైస్తవులు కొన్ని విషయాలు చేసేందుకు మరియు కొన్ని విషయాలను త్యజించాలని 4 నుండి 6 అధ్యాయాల్లో చెప్తున్నారు. 4వ అధ్యాయం నుండి తరువాతి మూడు పాఠాల్లో క్రైస్తవుడు ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి, సంఘంలో ఎలా పరిచర్య చేయాలి, నూతన జీవితాన్ని ఎలా జీవించాలి అన్న విషయాలు చెప్తున్నాయి. క్రైస్తవ జీవితంలో ముఖ్యమైన పరిశుద్ధ పరచబడన జీవితం గురించి ప్రస్తుత చర్చలో చూస్తున్నాము.

## పరిశుద్ధపరచబడడం యొక్క అర్థము

"పశుద్ధపరచబడడం" అను పదం సాధారణంగా వాడబడకపోయినా, అది బైబిల్లో వివరించబడింది. పరిశుద్ధపరచబడడం అంటే ప్రాథమికంగా, "ఒక ప్రత్యేక అవసరం నిమిత్తం ప్రక్కన పెట్టడం" అని అర్థం. "పరిశుద్ధము" అన్న పదం యొక్క మూలం నుండే దీని మూలం కూడా వచ్చింది. పరిశుద్ధమైన ప్రతి వస్తువు, వ్యక్తి, స్థలం ఒక ప్రత్యేక లక్షణం కలిగియుంటుంది. సహజంగా పరిశుద్ధత అనే పదాన్ని దైవ సంబంధంగానే వాడుతుంటాము. ఒక వస్తువు లేదా ప్రదేశం పరిశుద్ధమైనప్పుడు అది ప్రత్యేకమైనది, అటువంటిదే దేవుని సొత్తు కూడా! ఒక వ్యక్తి క్రైస్తవుడైనప్పుడు అతడు దేవుని ప్రత్యేక సొత్తవుతాడు (తీతు 2:11-14). అతడిప్పుడు దేవుని సంబంధి అని క్రైస్తవుడు గ్రహించాలి.

2 రాజులు 23లోరాజైన యోషీయా పరిశుద్ధపర్చబడడాన్ని వివరిస్తున్నాడు. ఈ మంచి రాజు దేవుని వాక్యానికి అప్పగించుకునేందుకు సిద్ధమయ్యాడు (2 వచనం). దేవుని సత్యాన్ని విన్న తరువాత, "యెహోవా మార్గములందు నడచి, ఆయన ఆజ్ఞలను కట్టడులను శాసనములను పూర్ణ హృదయముతోను పూర్ణాత్మతోను గైకొని ఈ గ్రంథమందు వ్రాయబడియున్న నిబంధన సంబంధమైన మాటలన్నిటిని స్థిరపరుచుదుమని యెహోవా సన్నిధిని నిబంధన చేయగా జనులందరు ఆ నిబంధనకు సమ్మతించిరి ..." (3 వచనం). దేవుని వాక్యాన్ని అనుసరించడంద్వారా పరిశుద్ధ పరచబడిన జీవితాన్ని సాగించాలని రాజు యోషీయా నిశ్చయించుకున్నాడు. దేవుని ఆజ్ఞలకు లోబడేందుకు ఉత్సాహపడ్డారు. దేన్ని సరిదిద్దాలో, సరిదిద్దేందుకు, వాటి విషయమై వాదించేందుకు అతడు ఆలోచించలేదు. అతడు ఆజ్ఞలన్నిటిని పూర్ణ హృదయముతోను, పూర్ణాత్మతోను గైకొన్నాడు. ఎంత గొప్ప మాదిరి! మీరిప్పుడు, పరిశుద్ధ పరచబడిన జీవితం విషయమై కూడా మీరు ఇలాగే ఆలోచించాలి. ఆ పనికి మీరు సంపూర్ణంగా సమర్పించుకోవాలి.

కొరింథులోనున్న క్రైస్తవులకు వ్రాస్తూ పౌలు పరిశుద్ధపరచబడిన అంశాన్ని వివరిస్తున్నాడు. "క్రీస్తుయేసు నందు పరిశుద్ధపరచబడిన వారై పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడిన వారికి" అని వీరిని పౌలు సంబోధిస్తున్నాడు (1 కొరింథీయులకు 1:2). దీన్ని బట్టి క్రైస్తవులైన వారు పరిశుద్ధులు అని అర్థమవుతుంది. క్రైస్తవులందరూ పరిశుద్ధులు ఎందుకు అవుతారు? ఒకవ్యక్తి క్రైస్తవుడైనప్పుడు అతడు క్రయ రక్తం చేత కొనబడి దేవుని సొత్తవుతాడు. అతడు దేవుని పని నిమిత్తము "వేరుగా ఉంచబడి" లేదా "పరిశుద్ధపరచబడతాడు." పరిశుద్ధుడంటే

ఆశ్చర్యకరంగా జీవించే రోగి కాదు లేదా ఏదో సాహసాన్ని చేసినవాడు కాదు. కొరింథీయులు "పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడినవారు." వారు సువార్తను విని, నమ్మి, దాన్ని ఒప్పుకొని, మారుమనస్సు, బాప్తిస్మం పొందినప్పుడు వారు "పిలువబడ్డారు." (చూడండి రోమీయులకు 10:9–16.) కొరింథీయులు క్రీస్తుయేసు నామంలో "కడుగబడి" "పరిశుద్ధ పరచబడి" "తీర్చబడ్డారు." అని తరువాత వ్రాస్తున్నాడు (1 కొరింథీయులకు 6:11). ఒక వ్యక్తి దేవుని ఎదుట నీతిమంతునిగా తీర్చబడినప్పుడు రక్షణ పూర్తవుతుంది (రోమీయులకు 5:1, 9; 8:30). కొరింథీయుల "కడుగబడేంత" వరకు (పాపముల నిమిత్తం బాప్తిస్మం పొందటం) "నీతిమంతులుగా తీర్చబడలేదు." బాప్తిస్మ సమయంలో వారు దేవుని రాజ్యంలో నియమించబడ్డారు (కొలొస్సయులకు 1:13). అదే సమయంలో వారు దేవుని పని నిమిత్తం ప్రత్యేకపరచబడ్డారు. మీరు బాప్తిస్మం పొందినప్పుడు మీరు కూడా కడుగబడి, పరిశుద్ధపరచబడి, నీతిమంతులుగా తీర్చబడ్డారు. బాప్తిస్మ సమయంలో పరిశుద్ధపరచబడడం జరుగుతుందని వాక్యం బోధిస్తుంది.

పరిశుద్ధపరచబడుటకు మరో వివరణ ఎఫెసీయులకు 5:26లో ఇయ్యబడింది. క్రీస్తు సంఘాన్ని (తన వధువును) పరిశుద్ధపరిచాడు. క్రీస్తు తన సంఘాన్ని పరిశుద్ధపరిచాడు కాబట్టి దేవుని సంఘంలోనున్న వారందరూ పరిశుద్ధపరచబడినవారు. సామాజిక సంస్థలు, మతపరమైన సంస్థలు ఎన్ని మంచి పనులు చేసినా, ఎంత మంచి పేరు సంపాదించుకున్నా వారు పరిశుద్ధ పరచబడలేరు. ఒక వ్యక్తి పరిశుద్ధపర్చబడాలంటే (రక్షణనొందాలంటే) అతడు దేవుని సంఘంలో ఉండాలి. గ్రీకు పదం *hagiazo* పరిశుద్ధపర్చబడిన లేదా శుద్ధిచేయబడిన దానిని సూచిస్తుంది. మీరు క్రైస్తవులైనప్పుడు మీరు (ప్రభువు శరీరంలో (ఆయన సంఘములో, కొలొస్సయులకు 1:18) ముంచబడతారు. అదే సమయంలో మీరు రక్షించబడ్డారు కాబట్టి పరిశుద్ధపరచబడ్డారు.

ఒకవ్యక్తి క్రైస్తవుడైనప్పుడు, అతడు దేవుని చేత వాడబడేందుకు పరిశుద్ధపర్చబడతాడు. అతడు లోకంలోనున్న వారివలె ఉండలేనని గుర్తిస్తాడు. మారుమనస్సు దేవుని వైపు తిరిగేలా చేస్తుంది. అతడు సువార్తకు లోబడి పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొంది దేవుని సంఘంలో చేర్చబడ్డాడు కాబట్టి దేవుని వైపు తిరిగి, ఆయన ఆజ్ఞానుసారంగా పరిశుద్ధ పరచబడిన జీవితం జీవిస్తాడు.

### దానిని తెలియజేయుట

పరిశుద్ధపరచబడిన అనేది మనం "పరిశుద్ధులుగా" జీవించడంలో వ్యక్తపరచబడుతుంది. దురదృష్టవశాత్తు, పరిశుద్ధునిగా జీవించడం యొక్క అర్థం అనేకమంది ఈ అంశాన్ని గ్రహించలేకుండా చేస్తుంది. పరిశుద్ధుడు అంటే, ఒక వ్యక్తి క్రైస్తవుడైనందుకు పరిశుద్ధ జీవితాన్ని జీవించేందుకు సమర్పించుకొన్నవాడు అని వాక్యం బోధిస్తుంది. పరిశుద్ధ జీవితం అనేది ఆజ్ఞాబద్ధమైనది (1 పేతురు 1:13–16). పరిశుద్ధ జీవతం అంటే దేవునికి సమర్పించుకున్న జీవితం. ఈ జీవన విధానంలో క్రైస్తవుడు తన ప్రతి క్రియద్వారా, మాట ద్వారా దేవునికి మహిమ తెచ్చేందుకు ప్రయత్నిస్తాడు. పరిశుద్ధంగా జీవించటం అంటే, క్రైస్తవుడు దేవునికి సమర్పించుకొని దేవుని చిత్తానుసారంగా జీవించడం.

పరిశుద్ధ జీవితం 1 యోహాను 1:6–9లో దేవుని సత్యము యొక్క "వెలుగులో

నడవడం” అని వివరించబడింది. పరిశుద్ధులు తప్పుచేసినప్పుడు, అతడు దాన్ని ఒప్పుకుంటే, పాపక్షమాపణ దొరుకుతుంది. ప్రతి ఒక్కరూ పాపం చేస్తారు. అయితే, క్రైస్తవుడు దాన్ని ఒప్పుకొని, దాని విషయమై మారుమనస్సు పొందినప్పుడు అతన్ని క్షమిస్తాడు. పాపి తనప్రాణాన్ని విడిచిపెట్టినప్పుడే పాపక్షమాపణ దొరుకుతుంది. క్రైస్తవుడు గ్రహించవలసిన పదం “పాపం చేయుట” (1 యోహాను 3:8, 9). క్రైస్తవుడు క్రీస్తు వద్దకు రాకముందు పాపం చేసినట్లుగా, క్రీస్తు లోనున్నప్పుడు చేయకూడదు. మారుమనస్సుకు ముందు అతడు పాపం విషయంలో నిర్లక్ష్యంగా ఉండి యుండవచ్చు. కానీ మార్పు తరువాత, ఈ వైఖరి మారిపోవాలి. అసలు పాపం చేయకుండా ఉండటం అసాధ్యం కాబట్టి (1 యోహాను 1:10), పాపం యెడల క్రైస్తవుడు భిన్నమైన వైఖరి కలిగియుండాలి. ఈ వ్యత్యాసం 1 యోహాను 3:1-10లో వివరించబడింది. లోకంలో ఉన్నవారు పాపం చేసేందుకు మొగ్గుచూపుతుండగా, క్రైస్తవుని జీవితం పరిశుద్ధతకు సమర్పించుకోవాలి.

పరిశుద్ధ పరచబడియుండటం యొక్క ఫలితం ఏమంటే, అన్నింటిలోనూ మార్పు కలగడం! (చూడండి 2 కొరింథీయులకు 5:17.) దేవుని పరిచర్య నిమిత్తం క్రైస్తవుడు తన ఆలోచనలను వైఖరిని ప్రక్కన పెట్టేయాలి. అంతరంగ యోచనలను శుద్ధిచేయలేని వారు పరిశుద్ధులుగా జీవించలేరు (చూడండి మత్తయి 23:26-28; మార్కు 7:21; రోమీయులకు 2:1-5). పరిశుద్ధ పర్చబడ్డ క్రైస్తవుడు వేషదారి కాదు గాని, తన జీవితపు ప్రతి విషయంలోనూ దేవుని మహిమ పరిచేందుకు ప్రయత్నించువాడు. స్వేచ్ఛ నిమిత్తం బానిసత్వం నుండి విడుదల నొందిన పురాతన ఇశ్రాయేలు వంటివారు క్రైస్తవులు. ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి బయటికి వచ్చినప్పుడు, వారు ఏమీ వదిలిపెట్టలేదు (నిర్గమకాండము 10:24, 26); వారు మరలా తిరిగి ఐగుప్తుకు వెళ్ళాలనుకోలేదు. మనం పాపపు బానిసత్వం నుండి విడుదలపొందినప్పుడు ఈ లోకంలో మనకు సంబంధించిన దేన్నీ వదిలిపెట్టకూడదు!

మీరిప్పుడు క్రైస్తవులయ్యారు. మీరు పరిశుద్ధపరచబడ్డారు. దీనర్థం మీరు సంపూర్ణులు అని కాదు గాని, దేవుని చిత్తాన్ని మీ శాయశక్తులా అనుసరించేందుకు యత్నిస్తున్నారని! దీనర్థం. క్రీస్తు సారూప్యంలోకి మరింతగా మార్చబడేందుకు మీలోని ప్రతి అంశాన్ని మార్చుకుంటున్నారని! పరిశుద్ధపరచడాన్ని కొలొస్సయులకు 3:10 నూతనపరచడముగా వివరిస్తుంది. దీనికి వాడబడిన గ్రీకుపదం క్రొత్త నిర్మాణాన్ని అనగా నిర్మాణంలోని పాత పనిముట్లను తీసి క్రొత్తవాటిని వేసి క్రొత్తదిగా చేయడాన్ని సూచిస్తుంది. క్రైస్తవునిగా, మీరు ఈ పునఃనిర్మాణ పనిలోనున్నారు. మీ వైఖరి, అలవాట్లు, క్రియలు, మాటలు విషయమై దేవుడు మీ నుండి ఏం ఆశిస్తున్నాడో దాన్ని దినదినమూ నేర్చుకుంటారు. మీరు దేవుని వ్యక్తిగత పని నిమిత్తం ప్రత్యేకించబడ్డారు కాబట్టి మీరు దీన్ని చేస్తున్నారు.

### దాని ప్రాముఖ్యత

క్రైస్తవునికి పరిశుద్ధపరచబడటం ఎంతో అవసరం. పరిశుద్ధమైన వాటిని విఛిన్నపద్ధతిలో అర్పిస్తే దేవుని ఆగ్రహం దాన్ని కాల్చివేస్తుందని పాతనిబంధన చెప్తుంది (లేవీయకాండము 10:10; యెహెజ్కేలు 22:26) అలాగే క్రొత్తనిబంధనలోనూ దేవుని కోపం కనబడుతుంది. కొరింథీలోనున్న పరిశుద్ధులు తమ పరిశుద్ధతను పాడుచేశారు. వారి భక్తిని, శుద్ధతను లోక క్రియలు పాడుచేసేలా చేసారు.[1]

దేవుని పరిశుద్ధునిగా జీవించడం అనేది మన యిష్టమునకు విడువబడినది కాదు (1 పేతురు 1:13-16); పరిశుద్ధ జీవితాన్ని జీవించలేనివారు నిత్యనాశనాన్ని ఎదుర్కొంటారు (ఫిలిప్పీయులకు 3:17-19). మీరిప్పుడు క్రైస్తవులు, దేవుడే మీ పరలోక తండ్రి. దేవుని పరిశుద్ధ కుటుంబ ఛాయలను మీరు చూపించాలి. ప్రతిష్ఠింపబడుటకు సమర్పించుకోవడం ద్వారా మీరు ప్రతిష్ఠింపబడగలరు.

**ముగింపు విషయాలు**

క్రైస్తవుడవడం ఈ లోకంలో గొప్ప ఆశీర్వాదం. క్రీస్తును అనుసరించాలన్న ఒకరి నిర్ణయం, అతడు పాపము యొక్క దుఃఖాన్ని, దేవుని ప్రేమపూర్వకమైన కృపను అర్థంచేసుకోవటంలో ఉంటుంది. క్రైస్తవుడంటే, క్రీస్తు కాడిని అంగీకరించడం, మోయడం (మత్తయి 11:29) మరియు పరిశుద్ధంగా జీవించడం.

మొదటి శతాబ్ధంలోని క్రైస్తవులు తమకు చెప్పబడిన రక్షణను ఆనందించారు. రక్షణకు వారు స్పందించి, పరిశుద్ధంగా ఉండేందుకు తమను తాము సమర్పించుకున్నారు. అపొస్తలుల కార్యములు 5:29-42లో వారి సమర్పణ ఎలా ఉందో కనబడుతుంది. దేవుని ఆజ్ఞలను అనుసరించాలన్న వారి తీర్మానం కనబడుతుంది. పరిశుద్ధత అనేది పరిశుద్ధుని జీవన విధానం అని వారి ద్వారా స్పష్టమవుతుంది. పరిశుద్ధ జీవితం క్రైస్తవుని హృదయంలో ఆనందాన్ని, ఆత్మలో సమాధానాన్ని ఇస్తుందని వారికి తెలుసు. వారి విశ్వాసాన్ని వెల్లడి చేయడం ఎంత కష్టమైనా గాని, వారిలోని పరిశుద్ధతను వారికి పట్టుదలను ఇచ్చి మరింత ఉత్సాహంగా పరిచర్య చేసేలా చేసింది. నేడు దేవుడు తన పరిశుద్ధ జనం నుండి ఎదురు చూచేది కూడ యిదే.

క్రైస్తవులు పరిశుద్ధ జీవితాన్ని జీవించాలని దేవుడు ఆశిస్తున్నాడు. క్రీస్తుయేసు ద్వారా నూతన నిబంధనకు దేవుడు మనలను పిలిచాడు. గొఱ్ఱెలు పరిశుద్ధముగా లెక్కించబడినట్లే, తన ప్రజలను మహోపకారి లెక్కిస్తాడని చెప్తూ యిర్మీయా నూతన నిబంధన గురించి ప్రవచిస్తున్నాడు (యిర్మీయా 33:1-13).

పురాతన ఇశ్రాయేలుతో దేవుడు చేసిన పరిశుద్ధ నిబంధన ఈనాడు ఆయన మనకు ఇస్తున్న అవకాశాన్ని వివరిస్తుంది. మనకు సర్వోన్నతుడు పరలోక తండ్రిగానున్నాడు కాబట్టి ఆయన పిలుపును విని, పరిశుద్ధంగా జీవించేలా ప్రతిస్పందించుదాము! "కాగా మీరు నా మాట శ్రద్ధగా విని నా నిబంధన ననుసరించి నడిచిన యెడల మీరు సమస్త దేశజనులలో నాకు స్వకీయ సంపాద్యమగుదురు. సమస్త భూమియు నాదే గదా. మీరు నాకు యాజక రూపమైన రాజ్యము గాను పరిశుద్ధమైన జనము గాను ఉందురు" (నిర్గమకాండం 19:5, 6). క్రీస్తు రాక ఈ మాటలను నెరవేర్చింది. ఇప్పుడు క్రైస్తవులకు ఇలా చెప్పబడింది, "అయితే మీరు చీకటిలోనుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచిన వాని గుణాతిశయములను ప్రచురము చేయునిమిత్తము, ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధజనమును, దేవుని సొత్తయిన ప్రజలునైయున్నారు" (1 పేతురు 2:9).

సూచన

[1]చదవండి 1 కొరింథీయులకు 1:10–13; 3:1–3, 16–19; 4:6, 14; 5:1–13; 6:13–19; 8:11, 12; 10:10, 21; 11:17–20; 12:25.